సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కార్టూన్ వేయడంలో శిక్షణ



ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో బోర్డుపై కార్టూన్ వేస్తున్న విద్యార్థి

ఆరిలోవ: బాలల హక్కుల వారోత్సవంలో భాగంగా దీన్‌దయాళ్‌పురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో బుధవారం 'కార్టూన్లు–బాలల అంశాలు' అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రముఖ కార్టూనిస్ట్ బి.హరి వెంకటరమణ ఇక్కడి విద్యార్థులకు కార్టూన్ వేయడంలో శిక్షణ ఇచ్చారు. బాలల భక్కులు, బాలల చట్టాలు, పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రతలు, పిల్లల భవిష్యత్, తదితర వాటిపై చిత్రాలను బోర్డుపై రాయించారు. ఈ కార్యక్రమంలో గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య, గృహం సిబ్బంది వై.చిరంజీవి, డాక్టర్ ఫణీంద్ర పాల్గొన్నారు.

కేడీపీఎం పాఠశాల విద్యార్థులకు నగదు పురస్కారాలు



విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న సభ్యులు

ఏయూ క్యాంపస్: క్రీడల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన ముగ్గురు కేడీపీఎం పాఠశాల విద్యార్థులకు రూ.4 వేలు చొప్పున నగదు పురస్కారాన్ని శివాజీ పార్క్ గొడుగు వాకర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ వాల్తేర్ సంయుక్తంగా అందించాయి. వాకర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.శివరామకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వరరావు ఈ నిధులను సమకూర్చారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు వీటిని స్వయంగా అందించారు. ఈ కార్యక్రమంలో 101 డిస్ట్రిక్ గవర్నర్ యు.శుభ, ఆచార్య వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, కార్యదర్శి వి.సత్యనారాయణ, డాక్టర్ ఎన్.రామకృష్ణ, హెచ్‌ఎం సుమతిబాయి, క్రీడా ఉపాధ్యాయిని రత్నం పాల్గొన్నారు.

12వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పెదగదిలి కొండవాలు వాలుతో మాట్లాతున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలిసి వార్డులో పర్యటించారు. పదో సచివాలయం పరిధి రామలక్ష్మణపురం, రాధాకృష్ణనగర్, సంతపాలెం ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల ప్రయోజనాలు వివరించారు. పొందిన లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలు ఉంటే వెంటనే సచివాలయం సిబ్బందికి, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు జ్యోతి ప్రకాష్, ఈగల బుజ్జి, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు ప్రారంభించారు. గ్రంథాలయాల ఆవశ్యకతను విద్యార్థులకు ఆయన వివరించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

రాష్ట్రాభివృద్ధికి వైఎస్ జగన్ అవసరం



12వ వార్డులో జగనన్న సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ



సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అవసరమని ప్రజలు కోరుకుంటున్నారని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 12వ వార్డు చినగదిలిలో బుధవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ముందుగా ఎంపీ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లుగా ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేద విద్యార్థుల కోసం జగనన్న అమ్మఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ కానుక, రైతుల కోసం వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, వైఎస్సార్ మత్స్యకార బీమాతో పాటు వైఎస్సార్ చేయూత, పెన్షన్ కానుక, కాపు నేస్తం, సున్నా వడ్డీ, జగనన్న తోడు, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ కంటి వెలుగు, జగనన్న గోరుముద్ద, ఇంటింటికి రేషన్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ తదితర పథకాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ పథకాలు వల్ల తూర్పు నియోజకవర్గంలో వేలాది కుటుంబాలు లబ్ధి పొందాయన్నారు. అందుకే వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, స్థానిక నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, చొక్కర శేఖర్, జ్యోతి ప్రకాష్, ఈగల బుజ్జి, సూర్యారావు, బాలరాజు, వరహాలరావు, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం సాధ్యం



12వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ, తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డులో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. వార్డులో గడపగడపకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ జగనన్న పాలనలోనే రాష్ట్ర సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమానికి వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, పార్టీ నాయకులు మొల్లి అప్పారావు, గేదెల నాగరాజు, ఉమ్మిడి దాసు, ప్రేమ్, లక్ష్మణరెడ్డి, జెడ్సీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్వయం సంవృద్ధి సాధించడమే లక్ష్యం

- ఏయూ వీసీ ప్రసాదరెడ్డి



బోధనేతర సిబ్బందితో వేడుకల్లో పాల్గొన్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

ఏయూ క్యాంపస్: స్వయం సంవృద్ధి సాధించే దిశగా ఏయూను నడిపించడమే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. నాక్ ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించిన నేపథ్యంలో బుధవారం పరిపాలన భవనం ఎదురుగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఏయూపరిపాలన భవనంలో పనిచేస్తున్న సుమారు ఐదు వందల మందితో కలిసి ఈ విజయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీ చుట్టూ ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ పార్కులు భవిష్యత్‌లో ఏయూకు ఆర్థిక వనరులుగా మారతాయన్నారు. వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు వర్సిటీ నాది అనే భావనతో పనిచేయడం తాను గమనించానన్నారు. నాలుగేళ్ల పటిష్ట ప్రణాళిక మంచి ఫలితాన్ని అందించిందని సంతోషం వ్యక్తం చేశారు.. విభిన్న శాఖలు కలిగిన ఏయూ 3.74 సీజీపీఏ సాధించడం ఓ రికార్డ్‌గా నిలుస్తుందన్నారు. పూర్తిస్థాయిలో వర్సిటీని అభివృద్ధి చేయడానికి అవసరమైన శక్తి.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో తనకు లభించిందన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్, అకడమిక్ డీన్ ఆచార్య కిశోర్ బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, డీఆర్‌లు, ఏఆర్‌లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి వేడుకలు జరుపుకొన్నారు.

ముగిసిన జర్నలిస్టుల శిక్షణ



ప్రసంగిస్తున్న సుమిత్ భట్టాచార్జి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అమెరికన్ కాన్సులేట్ వేదికగా అమెరికన్ కాన్సులేట్, ఒడిశాకు చెందిన వ్యూప్స్ స్వచ్ఛంద సంస్థ వాతావరణ మార్పులపై తెలుగు జర్నలిస్టులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. పర్యావరణ, వాతావరణ మార్పుల దుష్ప్రభావాలపై తెలుగు జర్నలిస్టుల పరిజ్ఞానాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్టు వ్యూప్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.భీమారావు తెలిపారు. రెండో రోజు వర్క్‌షాప్‌లో ది హిందూ బ్యూరో చీఫ్ సుమిత్ భట్టాచార్జీ వాతావరణ మార్పుల రిపోర్టింగ్–టూల్స్ అండ్ టెక్నిక్స్ అంశంపై మాట్లాడారు. సీనియర్ జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త గంజివరపు శ్రీనివాస్ అభివృద్ధి ప్రాజెక్ట్‌ల కోసం పర్యావరణ, అటవీ అనుమతుల మంజూరు ప్రక్రియ– మీడియా పాత్రను వివరించారు. జర్నలిస్ట్ ఉదయ్ కుమార్ కొల్లి వాతావరణ మార్పు, గ్లోబల్ వార్మింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సరళమైన భాషలో సమాచారంతో, కచ్చితమైన వాతావరణ రిపోర్టింగ్ విధానాలను తెలియజేశారు. హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ ప్రతినిధి టి.విదుర వందన సమర్పణతో వర్క్‌షాప్ ముగిసింది.

నాగన్న పూజకు ముస్తాబు

- శివారులో సిద్ధంగా సహజ పుట్టలు
- పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు



కంబాల కొండలో పుట్టలు



ముడసర్లోవ పార్కులో పుట్ట

ఆరిలోవ: నాగన్న పూజలకు తూర్పు నియోజకవర్గ ప్రజలు సన్నద్ధమవుతున్నారు. నాగులచవితిని పురస్కరించుకుని శుక్రవారం పాలు పోసేందుకు సహజ సిద్ధమైన పుట్టల కోసం పలువురు భక్తులు అప్పుడే అన్వేషణ మొదలుపెట్టారు. నగరం శివారు ప్రాంతంలో సహజ సిద్ధమైన పుట్టలు ఉంటాయనే నమ్మకం నగరవాసుల్లో ఉంది. నాగులచవితి రాగానే పుట్టలకు నెలవైన పర్యాటక ప్రాంతాలు ముడసర్లోవ పార్కు, ముడసర్లోవ పరిసరాలు, కంబాల కొండ, జూ పార్కు, కైలాసగిరి అందరికీ గుర్తుకొస్తాయి. ఆయా పార్కులకు అధిక సంఖ్యలో భక్తులు వెళ్లి నాగన్నను పూజించి అక్కడే వనభోజనాలు కూడా చేస్తుంటారు. దీంతో ఆయా ప్రాంతాల నిర్వాహకులు పుట్టల చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల తుప్పలను తొలగించి శుభ్రం చేశారు. ముడసర్లోవ పార్కు లోపల, రిజర్వాయరు గట్టుపైన, పరిసరాలలో అధిక సంఖ్యలో సహజమైన పుట్టలున్నాయి. కంబాల కొండలో పుట్టలకు కొదవ లేదు. కంబాలకొండ ప్రధాన ద్వారం నుంచి లోపల కొలను వరకు వందల సంఖ్యలో పుట్టలు దర్శనమిస్తున్నాయి. జూ, కైలాసగిరి పార్కుల్లో కూడా పుట్టలు ఎక్కువగా ఉన్నాయి. నాగులచవితి రోజున భక్తులతో ఆయా పార్కులు రద్దీగా ఉంటాయని నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ మేరకు తగినట్లు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

ఏయూలో సంబరాల వెల్లువ



వీసీ ప్రసాదరెడ్డిని అభినందిస్తున్న వృద్ధురాలు పార్వతి



పరిపాలన భవనం వద్ద ఫొటోలు తీసుకుంటున్న విద్యార్థులు



ఫార్మసీ కళాశాలలో..

ఏయూ క్యాంపస్: నాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ 3.74 సీజీపీఏ సాధనతో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. వర్సిటీలో నలుమూలల సందడి వాతావరణం కనిపించింది. జాతీయ స్థాయిలో అత్యుత్తమ నాక్ ర్యాంకు సాధించడంతో వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు ఆస్వాదిస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా పడ్డ శ్రమకు ఫలితంగా నేడు కనిపించడంతో సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి.

➡ ఏయూ నాక్‌లో అత్యుత్తమ స్థానం సాధించిన విషయాన్ని పత్రికల్లో చదివిన నగరానికి చెందిన డి.పార్వతి(87 సంవత్సరాలు) స్వయంగా ఏయూకు తన కుమారుడు డి.సాయి శివ ప్రసాద్ సహాయంతో వచ్చి వీసీ ప్రసాదరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.

➡ న్యాయ కళాశాలకు చెందిన పలువురు విశ్రాంత ఆచార్యులు కూడా వీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏయూ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులతో కలసి రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ బాణసంచా కాల్చి సందడి చేశారు. విద్యార్థులు వీసీ మాస్కులను ధరించి, థ్యాంక్యూ వీసీ సార్ అంటూ నినాదాలు చేశారు. వుయ్ లవ్ ఏయూ అంటూ పెద్దెత్తున నినాదాలు చేశారు. అనంతరం న్యాయ కళాశాలలో జరిగిన వేడుకల్లో రిజిస్ట్రార్‌తో పాటు ప్రిన్సిపాళ్లు ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, వి.విజయలక్ష్మి, ఆచార్యులు ఎ.కె.ఎం.పవార్, గిరిజాశంకర్, గిరిజా శాస్త్రి, సీతామాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

➡ ఏయూలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న పలువురు విదేశీ విద్యార్థులు వీసీని కలిసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. క్రీడా విభాగంలో విదేశీ విద్యార్థులు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎ.పల్లవి, ఎస్.విజయ్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఫొటో స్పాట్

వర్సిటీ పరిపాలన భవనం వద్ద ఏర్పాటు చేసిన ఫొటో స్పాట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆధునీకరించిన పరిపాలనా భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ సెల్ఫీ పాయింట్ వద్ద పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు వచ్చి ఫొటోలు తీసుకుంటూ ముచ్చటపడుతున్నారు.

ఏయూ సమాచారం..

విభాగాల ఆకస్మిక తనిఖీ



ఇంజినీర్స్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న రిజిస్ట్రార్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పలు విభాగాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ బుధవారం తనిఖీ చేశారు. ముందుగా ఇంజినీర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. పరిసరాలలో ఉన్న వ్యర్థాలను సత్వరం తొలగించాలని, మరింత సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఇక్కడున్న అధికారుల కార్యాలయాలను పరిశీలించారు. అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సూచనలు చేశారు. ఇంజినీర్స్ కార్యాలయంలో ఫైళ్ల నిర్వహణను స్వయంగా పరిశీలించారు. ట్రాన్స్‌పోర్ట్ విభాగం కార్యాలయం, పారిశుధ్యం, తదితర విభాగాలను రిజిస్ట్రార్ పరిశీలించి, పలు సూచనలు చేశారు.

ఆలోచనలు సాకారం చేసుకోండి



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ ఆలోచనలను సాకారం చేసుకుంటూ ముందుకు సాగాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ జీఐఎస్ డేని పురస్కరించుకుని ఏయూ జియో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో జీఐఎస్ బియాండ్ ఎర్త్ అనే అంశంపై నిర్వహించిన ఒక రోజు సదస్సులో ఆయన మాట్లాడారు. తమ సామర్థ్యాలను పూర్తి స్థాయిలో ప్రస్ఫుటం చేసుకోవాలన్నారు. జీఐఎస్ ఎంతో ఆసక్తి కలిగించే అంశమని, దీనిని నేర్చుకోవడం తనకు సైతం ఎంతో ఇష్టమన్నారు. వర్సిటీ నాక్‌లో అత్యుత్తమ స్థానం సాధించడం వెనుక విద్యార్థుల కృషిని అభినందించారు. దీని ఫలితాలను నేడు విద్యార్థులు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య వజీర్ మహ్మద్, ఆచార్య కాకాని నాగేశ్వరరావు, ఆచార్య డి.లలిత భాస్కరి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఢిల్లీలో 24న ఆశ్రా జాతీయ సదస్సు



ఎంపీ ఎంవీవీ చేతుల మీదుగా సదస్సు పోస్టర్ ఆవిష్కరింపజేస్తున్న ఆశ్ర ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మక వినియోగదారుల సంస్థ ఆశ్ర (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్) 5వ జాతీయ సదస్సు ఈ నెల 24న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్నట్టు సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు పాలమరశెట్టి రత్నరాజు తెలిపారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా పాలమరశెట్టి మాట్లాడుతూ సెలబ్రిటీ గెస్ట్‌గా టాలీవుడ్ యాక్టర్ అలీ, భారతదేశ వినియోగదారుల సంఘం కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్, అమెరికా ఆపరేషన్ హెడ్ హరికృష్ణ, సౌత్ కొరియా ఖనరీసస్ వ్యవస్థాపకుడు హంగ్‌సున్‌యంగ్, బాబూభాయ్, ఆర్‌ఆర్ టీమ్, ఖంటేయం తదితరులు హాజరు కానున్నారని చెప్పారు. ఆశ్రా మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన సంస్థగా దేశంలో సుమారు వెయ్యికి పైగా ప్రతినిధులతోనూ, చీఫ్ ప్యాట్రన్ సుప్రీం కోర్టు లాయర్ హబీబ్ సుల్తాన్ అలీ నేతృత్వంలో దేశంలోని పది రాష్ట్రాల్లో నడుస్తుందన్నారు. జాతీయ స్థాయిలో వినియోగదారులకు అవగాహన కల్పించి వారికి ప్రతిభా అవార్డులు అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇక్బాల్ తెలిపారు. కార్యక్రమంలో ఈవెంట్ హెడ్ వీరూమామ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


గుర్తు తెలియని మృతదేహం లభ్యం



నిర్మానుష్య ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం సమీప శ్రీకృష్ణాపురం ఎదురుగా శ్మశానవాటిక వెనుక నిర్మానుష్య ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహాన్ని బుధవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. మృతి చెంది వారానికి పైగా కావడంతో దుర్వాసన వెదజల్లడంతో ఎవరూ దగ్గరకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మృతదేహం నల్లగా ఉండి మనిషి కూర్చొన్నట్లు కనిపించింది. దూరం నుంచి చూసిన స్థానికులకు నల్లగా కనిపించడంతో ఎవరో హత్యచేసి కాల్చేశారంటూ పుకార్లు లేపారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం వయసు, అడ్రస్ తెలుసుకోవడానికి కూడా వీలుపడలేదు. మృతదేహాన్ని మార్చురీకి తరలించడానికి కూలీలు సైతం పోలీసులకు ముఖం చాటేశారు. దీంతో చీకటి పడినంత వరకు మృతదేహం అక్కడే ఉండిపోయింది. ఆఖరుకి పోలీసులు కొందరు కూలీలను ఒప్పించి ఆటోలో కేజీహెచ్‌లో మార్చురీకి తరలించారు. మృతదేహం ముందు మద్యం బాటిల్ ఉండటంతో కూర్చొని మద్యం తాగుతుండగా ప్రాణాలు విడిచి ఉంటాడని భావిస్తున్నారు. దీనికి సంబంధించిన ఆధారాలు పోస్టుమార్టంలో వెల్లడవుతాయని పోలీసులు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమస్యలపై ఎన్‌ఎంయూఏ నాయకుల నిరసన



విశాఖ-1 డిపో మద్దిలపాలెం వద్ద నిరసన చేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం : రాష్ట్ర ప్రజా రవాణా శాఖ జోన్–1 విజయనగరం పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మద్దిలపాలెం విశాఖ డిపో–1 వద్ద బుధవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్‌ఎంయూఏ) నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూఏ జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అనేక సార్లు అధికారులు వినతి పత్రాలు అందజేశామన్నారు. అయినా పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తే దానికి విరుద్ధంగా జోన్ 1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వ్యవహరిస్తున్నారన్నారు. రెండు రోజుల పాటు డిపో గేట్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ నెల 21న జోన్‌లోని అన్ని జిల్లా ప్రజా రవాణ శాఖ కార్యాలయల వద్ద రిలే నిరాహార దీక్షలు చేయనున్నామని ఆయన తెలిపారు.

డీసీఎస్ ఆర్‌ఎంవోకు పదోన్నతి



డాక్టర్ వాసుదేవ

మహారాణిపేట : కేజీహెచ్ డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్‌ఎంవోగా పని చేస్తున్న డాక్టర్ ఎ.వాసుదేవకు పదోన్నతి లభించింది. సివిల్ సర్జన్ ఆర్‌ఎంవోగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పుట్టపర్తి సత్యసాయి జిల్లా జాతీయ అంధత్వ నివారణ ప్రాజెక్టు చీఫ్‌గా ఆయనను నియమించారు. గతేడాది మే 4 నుంచి డాక్టర్ వాసుదేవ కేజీహెచ్‌లో డీసీఎస్ ఆర్‌ఎంవోగా పని చేస్తున్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో కర్లికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో ఫార్మసీస్, వరుణ్ మోటర్స్, శ్రీరామ్ చిట్స్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, దక్కన్ ఫైన్ కెమికల్స్, స్పెక్ట్రమ్ టాలెంట్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 500 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

అయ్యప్ప పడి పూజ మహోత్సవం నేడు



అయ్యప్ప స్వాములకు భిక్ష పెడుతున్న దృశ్యం

మద్దిలపాలెం : కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞాన లింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీధర్మశాస్త అయ్యప్ప ఆలయంలో గురువారం పడి పూజా మహోత్సవం నిర్వహించనున్నామని గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీలా రమణ తెలిపారు. పూజా మహోత్సవానికి అయ్యప్ప, భవాని, శివమాల ధారణ చేసిన స్వాములు హాజరు కావాలని కోరారు. ఆలయం ప్రాంగణంలో డిసెంబర్ 13వ తేదీ వరకూ నిత్యాన్నదానం కార్యక్రమం కొనసాగుతుందన్నారు. బుధవారం నాటి భిక్ష కార్యక్రమానికి పి.వి.ఆర్ ప్రాపర్టీస్ యాజమాన్యం సహకారం అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో పీవీఆర్ ప్రతినిధులు పువ్వాడ చంద్ర గుప్తా, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ ఈస్ట్
9912220751, 9010055116
Office mail : sakshiadvtvsp@gmail.com